# సౌందర్యోపాసకుడు

మధ్యతరగతి కుటుంబంలోని మధు ఒకరోజున తను ఎదుర్కొంటున్న కష్టాల్నిగూర్చి ఎంతగానో విచారించాడు. తనకు ప్రస్తుతం లభించే జీతం చాలటంలేదని వాళ్ళ ఆఫీసు మేనేజరుకు దరఖాస్తులమూలకంగా, వ్యక్తిగతంగా విన్నవించుకున్నాడు. కాని లాభంలేకపోయింది. ఆఫీసు మేనేజరు దృష్టిలో మధుకు లభించే జీతం చాలా ఎక్కువని. ఎలాగంటే ఆయన చెప్పేది—ఈ ఉద్యోగం వదలి గవర్నమెంటు సర్వీసులో ప్రవేశించినా ఇంతకంటే ఎక్కువవుండదట. కాని... మద్రాసులాంటినగరంలో తొంభైరూపాయలతో—అందులో పెళ్ళాం పిల్లలతో వుండటం అంటే—ఎంత కష్టమో నాలుగొందలు సంపాయించే మధు ఆఫీసు మేనేజరుకు తెలీకపోవచ్చు. కాని వీళ్లు పడే పాట్లు ఇన్నన్ని కావు.

మధు తను ఎదుర్కొంటున్నకష్టాల్నిగూర్చి విచారించటంలో ఆశ్చర్యంలేదు. ఎప్పటికైనా మంచిరోజులు రాక మానవు—అనే ఆశతో జీవించే వ్యక్తులలో మధు ఒకడు. అలా జీవించకపోతే రోజు గడవటమే పెద్దసమస్యఅయిపోతుంది. ఆలోచనలభారంతో క్రుంగి కృశించిపోవలసివుండే అలాంటి ప్రమాదంనుంచి మధు తప్పించుకోగలిగాడు.

సహనానికి ఒక హద్దు వుంటుంది. తన ఎదుట కష్టాల పరంపరలు అగణ్యంగా కన్పించటంతో మధు వాటిని చూడలేక కర్తవ్యంకోసం రాత్రింబవళ్ళు ఆలోచించాడు. చివరకు

ఈ ఉద్యోగం వదిలి—జీతం ఎక్కువ లభించే మరో ఉద్యోగం దొరకగలదేమోనని పలుచోట్ల ప్రయత్నించాడు. ఆఖరికి మధు సఫలీకృతుడయ్యాడు. అతనికి మరోచోట ఉద్యోగం లభించింది. అతని ఆనందానికి మేరలేదు. కారణం తను చేసే పని మరోచోటకూడా ఒకటే అయినా జీతంమాత్రం వెనుకటి కంటే రెట్టింపు లభిస్తోంది.

ఈ ఉద్యోగంలోచేరి పదిరోజులయినా కాలేదు. ఆఫీసర్‌తో మరోచోటికి క్యాంపు వెళ్ళాల్సివచ్చింది. సాయంత్రం సెంట్రల్‌స్టేషన్‌కు వెళ్ళేప్పటకి తన పేరు సెకెండ్ క్లాసు రిజర్వేషన్ లీష్టులో వుంది. తన కళ్ళను తాను నమ్మలేక పోయాడు. ఏదో ఒక క్రొత్త ప్రపంచంలోకి వెళ్తున్నవాడిలా 'ఫీ' లయాడు. గతంలో మద్రాసునుంచి తనవూరు వెళ్ళేందుకు మూడో క్లాసుకు సరిపడేడబ్బు సైతం లేక నానా యాతనలకు గురైన మధు—ఈ రోజున తనఆఫీసర్‌తోసహా—సెకెండ్ క్లాసులో ప్రయాణం చేస్తున్నాడు. అతని జీవితంలో ఇదో గొప్ప విషయమే.

మద్రాసు సెంట్రల్‌లో బయలుదేరిన బ్లూమౌంటెన్ ఎక్స్‌ప్రెస్ రెండోరోజు ఉదయానికి మధునూ, మధు ఆఫీసర్నీ అతని ఇతర బంట్రోతుల్నీ నీలగిరి పర్వతం సమీపంలోకి చేర్చింది. మరో రైల్లోకూచొని ... నీలగిరి కొండలమీద ప్రయాణం చేస్తున్నప్పుడు మధు ఆనందానికి అంతులేక పోయింది. ఎన్నోవందల అడుగుల ఎత్తుకు రైలు ఎక్కుతూ ఎంతో ప్రయాసపడుతోంది. చేతులు చాపితే చెట్ల ఆకులు అందుతున్నాయి. రకరకాల చెట్లు వందల అడుగుల ఎత్తున

పెరిగి వున్నాయి. ఏవో పేర్లు తెలీని చెట్లు లతలుగా అల్లుకున్నాయి. రంగురంగుల పూలు విరియబూసి వున్నాయి. అడుగడుక్కీ సెలఏర్లు ప్రవహిస్తున్నాయి. కొండమీదనుంచి రైల్వేలైను పక్కనే ప్రవహించే నీటి ధార తుంపరలు రైల్లో కూచున్న మనుషులమీద పడుతున్నాయి. రైలు ఎన్నో వంకరలు తిరుగుతూ సొరంగాల్లో దూరుతూ ముందుకు గర్భిణీ స్త్రీలాగ నడుస్తోంది. మధ్య మధ్యలో - అగాధంలో కనిపించే ఎంతో లోతు లోయలు రైల్లోనుంచి చూస్తే భయమేస్తోంది కూడా. కోతిపిల్లలు అటూ ఇటూ దూకుతున్నాయి. పక్షుల రకరకాల ధ్వనులు వినవస్తున్నాయి. ఇతమిద్ధంగా తేల్చి చెప్పలేని సువాసనలు అనేకం రైలు పెట్టెలోకి గుబాళిస్తున్నాయి.

మధు నీలగిరి పర్వతాల ప్రకృతి రామణీయకతను చూచి రకరకాల భావనలకు లోనయ్యాడు. తనకు కవిత్వం వస్తే ఎంతో బావుండేదని పలుమార్లు అనుకున్నాడు. ఈ ప్రకృతి సౌందర్యాన్ని కవిత్వపు మూసలోపోసి - లోకం ఎదుటవుంచి ఆనందంలో ముంచెత్తాలని అతని కోరిక.

ఒంటిగంటకు ఉదకమండలం స్టేషనులో మధు ఆఫీసరు వెంట దిగి బయటికివచ్చి - వాళ్ళకోసం తయారుగా వున్న కారులో ఎక్కి మకాంకు చేరుకున్నాడు. తన ఆఫీసరుకు అన్ని ఏర్పాట్లు చేయబడ్డాయి. ఆఫీసరుతో పాటు మధుకుకూడా ప్రత్యేక సదుపాయాలు ఒనగూడాయి. మధుకు ప్రత్యేకంగా ఒక గది. గదిలో స్ప్రింగ్ మంచం. టేబిల్ లైట్. డ్రెస్సింగ్ టేబిల్ - అన్నీ బావున్నాయి. తన సామాను గదిలో నుంచి

బయటికి వచ్చి చూస్తే ఎంతో కన్నుల పండువుగా వుంది అంతాను. ఏర్‌కండిషన్ గదిలో వుంచినట్లున్నది వాతావరణ మంతా. చుట్టూ అంతులేకుండా పెరిగివున్న యూక్‌లిప్టస్ చెట్లు తమ సువాసనల్ని వెదజల్లుతున్నాయి.

నిజంగా మధు ఒక క్రొత్తజీవితంలో అడుగుపెట్టాడు. ఆఖరికి అతని కోరికలు నెరవేరినాయి. తన వెనుకటి జీవితానికి ఇప్పటికీ ఎంతో వ్యత్యాసం వుంది. పరిస్థితులు తనను ఒక సుఖ మయ జగత్తులోకి విసరివేసినాయి. ఇక మధుజీవితంలో "లోటు" అనేది వుండదు. అతని కష్టాలు తమంతటతామే నాందిగేయాలు పాడుకున్నాయి. అతని జీవితంలో అంధకారం అంతరించి చల్లని వెన్నెలను వెల్లివిరిసినాయి. తను నిరీక్షిం చిన ముహూర్తం తనకు అనాయాచితంగా సంప్రాప్తించింది.

మధు పదిహేను రోజులపాటు ఇక్కడ వుండాలి. తను రోజూ ఉదయం తొమ్మిది గంటలకు ఆఫీసరు దగ్గరకెళ్ళి రెండు గంటలపాటు నోట్సు తీసుకుంటే మూడు గంటలకల్లా పని పూర్తవుతుంది. ఆతరువాత అతనికి స్వేచ్ఛ. ఎనిమిదివేల అడు గుల ఎత్తున నీలగిరి పర్వతాలమీద నిర్మించబడిన ఉదకమండ లంటౌన్‌నుచూచీ... దాని చుట్టూవున్న ప్రకృతిశోభను చూచీ మధు తన సమయాన్ని గడిపివేయవచ్చు. ఇలాంటి చోట జీవితం చాల హాయిగా గడుస్తుంది. ఎన్ని సంవత్సరా లయినా ఇట్టే గడిపివేయవచ్చు. ఇంతటి అపురూప సౌందర్యం తన ఎదుట ఒలికి పోవటం - మధు ముందెన్నడూ చూడ లేదు.

ఎంతోమంది వేసవిలో ఊటీలో వుండేందుకు బాగా డబ్బుగలవాళ్ళూ, గవర్నమెంట్ ఉద్యోగస్థులూ వందలు ఖర్చుపెట్టుకొని - పరుగెత్తుకొస్తారు. శరీర శాంతికోసం, మానసిక శాంతికోసం - వీళ్ళిక్కడికివచ్చి - ఈ ప్రకృతి శోభకు మైమరచి... తిరిగి వెళ్తారు. ఇలాంటి సదవకాశం యాదృచ్ఛికంగా మధుకులభించటం అతనిఅదృష్టమనేచెప్పాలి.

ఉదయం ఆరుగంటలకల్లా మధుకు బెడ్ కాఫీ వస్తోంది. ఆ తరువాత స్నానానికి వేడినీళ్ళు. ఎనిమిదిగంటలకు బ్రేక్ ఫాస్ట్. ఒంటిగంటకు లంచ్. నాలుగింటికి చాయ్. ఎనిమిదింటికి డిన్నర్. నౌకర్ గోపాలం మధుకు ఈ ఏర్పాటంతా చేస్తాడు. ఈ పనులతో బాటుగా మధు గోపాలాన్ని అప్పుడప్పుడు బజారుకు పంపిస్తుంటాడు. పోస్టాఫీసుపని చేయిస్తాడు. బూట్ పాలిష్, గుడ్డలు చాకలి దగ్గరికి తీసుకెళ్ళటంకూడా గోపాలం పనే. తన వయస్సులోనే వున్న గోపాలంచేత ఇన్ని పనులు చేయించడానికి— మధు సంకోచించనైనా లేదు. తన పనుల్ని ఇంత నియమంగా చేసుకుపోతున్న గోపాలాన్ని మధు ఎన్నడైనా 'నీకు జీతమెంత ? నీ పెళ్ళయిందా ? పిల్లలెందరు ?' అని మాటమాత్రానికేనా అడగలేదు ! బహుశా ప్రస్తుతం మధు ఈ జీవితంలోని వ్యక్తుల లోటుల్నిగూర్చి ఆలోచించటం మానివేశాడేమో ?

♦ ♦ ♦ ♦ ♦ ♦

'రేషన్ తెచ్చుకుంటాను— మూడు రూపాయలుంటే ఇవ్వండి. జీతం రాగానే ఇస్తాను నిన్నటినుంచి వంటే చేసుకోలేదు. చిన్నపిల్ల ఆకలికి ఏడుస్తోంది' అని గోపాలం అతి

వినయంగా అడగటంతోటే— ఒక నిమిషంపాటు మధు నిశ్చేష్టతతో నిలుచుండిపోయాడు. తనకోసం ఇంత శ్రమ పడుతున్న గోపాలం నిన్నటినుంచి పస్తున్నాడంటే— అతని హృదయాన్ని బాకుతో పొడిచినట్లయింది. ఐదు రూపాయల నోటు అతని కిచ్చి— వెంటనే ఇంటికెళ్ళిపొమ్మన్నాడు !

అకస్మాత్తుగా మధుకు తన భార్య గుర్తుకొచ్చింది. పసిపిల్లతో మదాసులో వున్నది. సరైన తిండి లేకపోవటం వల్ల బక్క-చిక్కిన తన భార్యా, పాలులేక ... సన్నగా ఎముకలు కన్పించే తన పసిపాపా— మనోవీధిలో మెదల టంతో మధు మనస్సుచుట్టూ వేదన అల్లుకుపోయింది. ఆఫీసర్‌తో వచ్చేరోజున తన దగ్గిర డబ్బు లేనందున, తను క్యాంపులో వున్నన్నిరోజులు జీవనభృతికోసం ఇంటిపక్క-వాళ్ళ నడిగి అప్పు తీసుకోమని చెప్పి వచ్చాడు. ఒక వేళ అప్పు పుట్టివుండకపోతే - తన భార్యా, పిల్లా — ఆకలితో అలమటించాల్సిందే! కొత్త ఉద్యోగంలో చేరి ఇంకా నెలన్నా గడవలేదు !

మధు మొదటిసారిగా— గోపాలాన్నిగూర్చి దీర్ఘంగా ఆలోచించాడు ! తొంభై రూపాయలు సంపాదిస్తూ తనెన్నో కష్టాలకు లోనయ్యాడు. ఇరవయ్ రూపాయల జీతంలో గోపాలం తన కుటుంబాన్ని ఎలా నడుపుకోగలుగుతున్నాడు? అయినప్పటికీ తన కుటుంబానికీ, గోపాలం కుటుంబానికీ ఎక్కడో సారూప్యత వుంది ! ఉభయులూ జీవించేందుకు పోరాటంసల్పుతున్నారు ! ఆకలి ఈ రెండు కుటుంబాల్లోని ప్రతి వ్యక్తిలోనూ వున్నది...

మధు తనకెట్టెదుటవున్న 'ట్రే'ని అవతలికి తోసేశాడు-కోపంతో. తనకోసం గోపాలం తెచ్చిన టిఫిన్, పొగలు కక్కుతూన్న కాఫీ... క్రిందపడిపోయాయి. మధు లక్ష్యం చెయ్యలేదు.

తొమ్మిది గంటలకు మధు తన ఆఫీసరు ఎదుట హాజరు కావలసివుండగా తొమ్మిదిన్నర అయినాక కూడా లెక్క చేయకుండా గబగబా నడిచి బయటికెళ్ళిపోయాడు!

యూరోపియన్ల పెద్ద పెద్ద బంగళాలు, రకరకాల హోటళ్ళూ, కేవల్‌రామ్స్, చెల్లారామ్స్ బట్టలదుకాణాలు-చూస్తూ స్టేషన్ వేపుకు వెళ్ళే రోడ్డువెంటబడి ఇంకా ముందుకెళ్తున్నాడు బస్‌స్టాండ్ దగ్గర్నుంచి... మరో మలుపుకు తిరిగాడు. అదో ఇరుకు సందు. నాలుగువేపులా రాళ్ళు నిలబెట్టి పైన గోనెపట్టాలు కప్పి— మనిషి దూరటానికి మాత్రమే సందున్నటువంటి— అనేక ఇళ్ళు— అతని కంట బడ్డాయి. ఒకచోట ఇంటిలోపల్నుంచి పొగ గుప్పున పైకి పోతోంది! మరో ఇంట్లో పిల్లలు రొదగా ఏడుస్తున్నారు. మరోచోట... ఎక్కడికో కూలిపనికి వెళ్ళేందుకు సంసిద్ధులవుతూన్న భార్యాభర్తలు కన్పించారు. అంతకు మినహా మరెక్కడా ఏమీ కన్పించలేదు. అక్కడవున్న ఇళ్ళన్నీ నిర్మానుష్యంగా వున్నాయి.

తరువాత తెలుసుకున్నాడు— వీళ్ళంతా... ఇంత పెద్ద పెద్ద భవనాలు నిర్మించుకొని కూచున్న యూరోపియన్ల టీ తోటల్లోనూ, కాఫీ ఎస్టేటుల్లోనూ పని చేసేందుకు సూర్యుడు ఉదయించినప్పుడు వెళ్ళి మరల సూర్యుడు అస్త

మించే సమయానికి ఇళ్ళకు తిరిగొస్తారు. ఏటవాలుగా వున్న కొండమీద, అరమైలు, మైలులోతున వున్న లోయల ప్రక్కన వీళ్లు పనిచేయాలి! అజాగ్రత్తగా వుంటే కాలు జారి లోయల్లో నామరూపాలు లేకుండా మృత్యుగహ్వరం లోకి చొచ్చుకుపోవలసిందే! దూర ప్రాంతాలనుంచి ఈ లోయల్ని, ఈ లోయల పచ్చదనాన్ని చూచి మనస్సును ఆహ్లాదపరచుకొనేందుకు ఎంతోమంది వస్తూ పోతూవుంటారు! కాని ఆ లోయలు రోజల్లా పనిచేసే ఈ కూలీల మరణ గీతాల్ని ఆలాపిస్తాయి! అక్కడి పచ్చదనం, చేయి ఎత్తితే అందే నీలిమేఘాలు— వాళ్ళకు అర్థం లేనివి.

హోటళ్ళపై అంతస్థులనుంచి మెట్లు దిగుతున్నారు— టూరిస్టులు. కొండప్రక్కగా వున్న లోయనూ, ఆ లోయ ప్రక్కనే వరసగావున్న చెట్లనూ—చూచి కెమేరా 'క్లిక్' మనిపిస్తారు. ఈ సౌందర్యానికి ముగ్ధులై...దాన్ని ఎన్లార్జిచేసి ఫొటో స్టేండ్‌లో అమర్చి టేబిల్ ముందు పెట్టుకుంటారు. కాని ఈ సౌందర్యం వెనక ఈ ప్రకృతిశోభ వెనక ఎంతో అసౌందర్యం, ఎంతో మలినం వుందని వీళ్ళకు తెలీదు. ఆ అసౌందర్యానికే సమాధి కట్టేందుకు వీళ్ళు యత్నించనన్నా యత్నించరు. నిజంగా ఈ టూరిస్టులు అలా చేయగలిగితే నిజమైన సౌందర్యోపాసకులే అవుతారు.

కేవల్‌రామ్స్ చెల్లారామ్స్ బట్టలదుకాణాల ముందు—బీదతనం తన నగ్నరూపాన్ని ప్రదర్శిస్తోంది. బక్కచిక్కిన బిచ్చ గాళ్ళు వుదకమండలపు చలిని భరించలేక - గోనె పట్టాల్ని కప్పుకొని కూడా వణుకుతూ - బిచ్చంకోసం ప్రార్థిస్తున్నారు.

ఉలెన్ సూటు వేసుకున్న అనేకమంది - ఈ బట్టల దుకాణాల్లో జొరబడి రకరకాల బట్టల్ని తీసుకొని బయటికి నడుస్తున్నారే గాని—వణికిపోతున్న బిచ్చగాళ్ళవేపు దృష్టి సారించనైనా లేదు.

హోటళ్ళముందు రకరకాలైన కార్లు ఆగి వున్నాయి. లోపల్నుంచి అమెరికన్ సంగీతం ప్రసారితమవుతోంది.

మధు ఇవన్నీ చూస్తూ—తన మకాంవేపుకు వస్తూ అనుకున్నాడు — ఈ సౌందర్యం అంతా డబ్బున్న వాళ్ళకు మాత్రమే. సామాన్య మానవుడు ఇక్కడా తన జీవితంకోసం పోరాటం సల్పుతూనే వున్నాడు. ఆ పోరాటం అంతమయితేనే - ఇక్కడ ఆనంద నిర్ఝరి ప్రవహిత మవుతుంది వాస్తవిక సౌందర్యం విరజిమ్ముకుంటుంది.

తన గదిలోకి ప్రవేశించగానే—బల్లమీద ఒక లేఖను చూచాడు. ఒక్కసారిగా అతని కళ్లు బయర్లుకమ్మినాయి. తన భార్య పిల్లలతోసహా ప్రమాదస్థితిలో వున్నదట. వెంటనే వెళ్ళిపోవాలి. ఇలా అనుకుంటూ వుండగానే ఆఫీసరు పంపిన ఒక కాగితం తీసుకొని గోపాలం వచ్చాడు. దాంట్లో ఆయన ఉదయం తొమ్మిది గంటలకు హాజరుకానందుకు కారాలు మిరియాలు నూరేడు. ఇలా బాధ్యతారహితంగా వుంటే నీవు నా కక్కరలేదని స్పష్టంగా రాశాడు.

దీన్ని చదివి మధు బాధపడలేదు. వెంటనే రెండో ప్రక్కన - నెలకు ఇరవైతొమ్మిది రోజులూ క్యాంపుల్లో వుండే ఈ ఉద్యోగం నా కక్కరలేదని, నా రాజీనామాను స్వీకరించి నాకు రావలసిన జీతం పంపించవలసిందనీ రాశాడు.

తను చేతులారా ఇలాంటి దివ్యమైన ఉద్యోగం పోగొట్టుకుంటున్నానని మధు విచారించలేదు. ఈ కలుషిత వాతావరణంనుంచి బయటపడటమే తనకు కావలసిందని అనుకున్నాడు.

రెండోరోజు మధ్యాహ్నం ఒంటిగంటకు మధు తన ఉద్యోగానికి రాజీనామాఇచ్చి — మదాసుకు ప్రయాణమయ్యాడు. రైలు కదిలేప్పుడు స్టేషన్ ప్లాట్‌ఫారంమీద నిలుచున్న మనుషులంతా టీ తోటల్లో పనిచేసే కూలీలుగా కన్పించారు. వాళ్ళంతా వరసగా నిలబడి...మా జీవితం చాలా దుర్భరంగా వుందని చెబుతున్నట్లనిపించింది. వాళ్ళలో తన ఐదు రూపాయలు అప్పుగా తీసుకొని వాపసు చేయలేని గోపాలం కూడా కన్పించినట్లయింది.

రైలు నడుస్తోంది. లోయల ప్రక్కగా సొరంగాలగుండా సెలయేటిధారల ధ్వనుల మధ్యనుంచి — రైలు ముందుకు సాగిపోతూవుంటే— మధు కిటికిలోనుంచి దేన్నీ చూడలేకపోయాడు. మాటిమాటికి అస్వస్థతగావున్న తన భార్యా పిల్లగుర్తుకువస్తున్నారు. గోపాలం వుండివుండి తన స్మృతిపథంలో మెదలుతున్నాడు. యూరోపియన్ల టీ తోటల్లో, కాఫీ ఎస్టేటుల్లో పనిచేసే అసంఖ్యాక కూలిలు తన మనోనేత్రం ఎదుట మెదలాడుతున్నారు.

వాస్తవంగా మధు నిజమైన సౌందర్యోపాసకుడు